క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 45 కుటుంబాలు చేరిక



పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండలంలోని కలమల్ల గ్రామానికి చెందిన 45 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి సమక్షంలో వైఎఆస్సార్‌సీపీలో చేరారు. వీరిని పార్టీ కండువ వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కలమల్ల గ్రామ మాజీ సర్పంచ్ సాకం పుల్లారెడ్డి, కలమల్ల మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, సాకం ప్రమిలమ్మ, మల్లిఖార్జునలతో పాటు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గంగాధర్ యాదవ్



వేంపల్లి : యాదవ సంక్షేమం, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా వడ్డరపు గంగాధర యాదవ్‌ను నియమిస్తూ బుధవారం ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని తాళ్లపల్లె గ్రామానికి చెందిన గంగాధర్ యాదవ్ వైకాపా పార్టీకి సేవ చేసినందుకు గాను గుర్తింపుగా యాదవ సంక్షేమం, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదవి ఇచ్చారు. రెండు సంవత్సరాల పాటు డైరెక్టర్ పదవి ఉంటుందని ఉత్తర్వులో పేర్కొన్నారు. రాష్ట్ర డైరెక్టర్ పదవి రావడంతో తనకు మరింత బాధ్యత పెరిగిందని, బీసీల అభివృద్ధికి కృషి చేస్తానని గంగాధర్ తెలిపారు.

పులివెందులలో మహిళా ప్రగతి యూనిట్ ఏర్పాటు



పొదుపు సంఘాల మహిళలతో మాట్లాడుతున్న మెప్మా పీడీ సురేష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి ఆదేశాల మేరకు పులివెందుల పట్టణంలో మహిళా ప్రగతి యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు మెప్మా పీడీ సురేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల రోడ్డులో మహిళా ప్రగతి యూనిట్ కోసం స్థలం కూడా పరిశీలించామన్నారు. ప్రగతి యూనిట్ ఏర్పాటు చేస్తున్న సభ్యులతో మాట్లాడి త్వరగా ప్రారంభించేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మెప్మా అధికారి గంగులయ్య, సీఓ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మినుము పంట పరిశీలన



గోటూరులో మినుము పంటను పరిశీలిస్తున్న ఏఓ సాయిజ్యోతి

వల్లూరు : మండలంలోని గోటూరులో రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన మినుము పంటను మండల వ్యవసాయ శాఖ అధికారి సాయిజ్యోతి బుధవారం పరిశీలించి మాట్లాడారు. సెప్టెంబర్ చివరి వారంలో కురిసిన వర్షాలకు పలువురు రైతులు వివిధ గ్రామాల్లో మొత్తం 2456 ఎకరాల్లో మినుము పంటను సాగు చేయగా ఇందులో 664 ఎకరాల్లో నీటి పారుదల కింద, 1882 ఎకరాల్లో వర్షాధారం కింద పంటను సాగు చేశారన్నారు. వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత నేపథ్యంలో బెట్టను తట్టుకోవడానికి గానూ పురుగు మందులతో పాటు నెలలోపు పంటకు 19-19-19 లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున, నెల పైన పంటకు 13-0-45 లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. దీని వలన మొక్కకు త్వరగా పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి మౌనిక, రైతులు పాల్గొన్నారు.

నిర్వాసితుల నుంచి అక్విడెన్స్‌లు స్వీకరణ

కొండాపురం : గండికోట జలాశయం కింద మొదటి విడత 14 గ్రామాలైన సీతాపురం, గండ్లూరు, ఓబన్నపేట, కె.బొమ్మేపల్లె, చౌటిపల్లె గ్రామాల్లో అదనపు పరిహారం కోసం నిర్వాసితుల నుంచి అక్విడెన్స్‌లు తీసుకున్నట్లు బుధవారం మండల తహసీల్దార్ శోభనబాబు తెలిపారు. గండికోట నిర్వాసితులకు రూ.3.25 లక్షలు అదనపు పరిహారం తమ బ్యాంక్ ఖాతాలో త్వరలోనే జమచేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

చింతకొమ్మదిన్నె : మండలంలోని 33-11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా గురువారం మండలంలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కమలాపురంను ఆదర్శ మున్సిపాలిటీగా చేస్తా

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : కమలాపురం పట్టణం రూపురేఖలను మార్చి రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మార్కెట్ యార్డు ప్రాంగణంలో రూ.1.20 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, ఇండస్ట్రియల్, అగ్రికల్చర్, హార్టికల్చర్ అడ్వైజర్లు రాజోలి వీరారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డితో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 ఏళ్ల క్రితం కమలాపురం ఎలా ఉందో నాలుగేళ్ల క్రితం వరకు అలాగే ఉండేదన్నారు. కమలాపురంను అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతోనే ముందుగా మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశానన్నారు. ఇప్పుడు రూ.58 కోట్లతో పట్టణం అంతా మంచి నీటి పైప్‌లైన్ వేస్తున్నామని, అలాగే రోడ్డు విస్తరణ, సుందరీకరణ పను లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పాలిటెక్నిక్, ఆసుపత్రి భవనాలను ప్రారంభించామన్నారు. ఆర్‌ఓబీ, బైపాస్, బీసీ వేల్ఫేర్ హాస్టల్, మున్సిపల్ బిల్డింగ్ తదితర నిర్మాణాలన్నీ పూర్తి చేసి కమలాపురంను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామన్నారు. మార్కెట్ యార్డులో ఏడాది క్రితం ఒక షాపింగ్ కాంప్లెక్స్, ఇప్పుడు మరో షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించామన్నారు. అలాగే రైతులకు పశువుల సంత ఏర్పాటు చేశామన్నారు. శీతల గిడ్డంగి, ప్రహరీ, రైతులకు అవసరమైన ప్లాట్‌ఫామ్ తదితరవి నిర్మిస్తున్నామన్నారు. ఈ నిర్మాణాలన్ని పూర్తి అయితే కమలాపురం రూపు రేఖలే మారిపోతాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీడీఎం శ్రీకాంత్‌రెడ్డి, ఏడీఎం ఆజాద్‌వల్లి, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ సంపత్‌కుమార్, ఏడీఏ నరసింహారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ పుల్లారెడ్డి, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, కాంట్రాక్టర్ శేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, సీఎస్ నారాయణరెడ్డి, చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ క్లినిక్‌లతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

పెండ్లిమర్రి : గ్రామీణ ప్రాంతాల్లో విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువస్తున్నాడని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డిలు తెలిపారు. మండలంలోని రంపతాడు గ్రామ సచివాలయం పరిధిలోని మమ్ముసిద్దుపల్లెలో నూతనంగా నిర్మించిన వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను బుధవారం వారు ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో జర్వంతో పాటు ఇతర చిన్న అనారోగ్య సమస్యలు వచ్చిన సకాలంలో విలేజ్ క్లినిక్‌లల్లో వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతోనే సీఎం జగన్ విటిని ఏర్పాటు చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులు విత్తనాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రమణారెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, సర్పంచ్ సంజీవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్లు సమయం పాటించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : వైద్యులు సమయం పాటించడంతోపాటు రోగులకు ప్రభుత్వా ఆసుపత్రులపై నమ్మకం కలిగించేవిధంగా విధులను నిర్వహించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి కోరారు. బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. వైద్యులు సకాలంలో విధులకు వచ్చి రోగులకు వైద్య సేవలను అందించాలన్నారు. ఆసుపత్రిలో ఉండే మందులను రోగులకు రాయించాలన్నారు. బయటికివెళ్లి తెచ్చుకోండి అంటూ చెప్పడం వల్ల ఆసుపత్రిపై ప్రజలకు నమ్మకం పోతుందన్నారు. వచ్చిన ప్రతి రోగికి వైద్యం అందించేవిధంగా విధులను నిర్వహిస్తే మంచి వైద్యులుగా గుర్తింపు రావడంతోపాటు ప్రభుత్వాసుపత్రికి మంచి గుర్తింపు వస్తుందన్నారు. విధి నిర్వహణలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా సూపరింటెండెంట్ గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రఫిక్‌పాషా, డైరెక్టర్లు నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోండి

కొండాపురం : ప్రజలు ఆర్వో ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నేదరపేట పునరావాసకేంద్రంలో నూతన ఆర్వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుశీలమ్మ, ఉపమండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు సుదర్శన్‌రెడ్డి, ఆర్.హరినారాయణరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, కె.మునిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కమలాపురం : మండలంలోని 5 వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోగటం 1, ఎర్రగుడిపాడు 1, సి.గోపులాపురం 1, ఎల్లారెడ్డిపల్లె 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆసక్తి గల అభ్యర్థులు 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు వాటిని ఎంపీడీఓ కార్యాలయంలో అందజేసి 14వ తేదీ జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు ఆయా సచివాలయాల్లో లేదా ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఖాళీగా వున్న గ్రామ వలంటీర్ పోస్టుకు అర్హులైన వారు ఈనెల 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కేఆర్‌ఎం ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. దుగ్గాయపల్లెలో ఖాళీగా వున్న ఈ పోస్టు ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. ఈ ఏడాది జూన్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాలు మించకుండా 10వ తరగతి లేదా దానికి సమానమైన విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. దరఖాస్తులను ఈనెల 11న పరిశీలిస్తారన్నారు. 12వ తేదీ నుంచి ఇంటర్వ్యూలను నిర్వహించి ఎంపికైన వారికికి 15వ తేదీన నియామక పత్రాన్ని అందచేస్తామని తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పూర్వ విద్యార్థులు సరస్వతి విగ్రహ ప్రతిష్ఠించారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

పంట సాగు చేసిన ప్రతి రైతుకు రశీదులు అందజేస్తాం

వీరపునాయునిపల్లె : 2023 ఖరీఫ్‌లో పంటలు సాగుచేసి నమోదు చేయించుకున్న ప్రతి రైతుకు రసీదులు అందజేస్తామని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. బుధవారం మండలంలోని మొయిళ్లచెరువు రైతు భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. మండల వ్యాప్తంగా 15 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 4773 మంది రైతులు 17608.16 ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగు చేశారు. సాగు చేసిన ప్రతి పంటను 100 శాతం నమోదు చేశామన్నారు. పంట సాగు చేసిన రైతుకు ఏ పంట సాగు చేశాడు, ఎంత విస్తీర్ణంలో సాగు చేశాడన్న వివరాలతో కూడిన రసీదులను వ్యవసాయ సహాయకులు అందజేస్తారన్నారు. 99.87 శాతం ఈకేవైసీ చేయించామన్నారు. రైతులు తమ గ్రామంలోని రైతు భరోసా కేంద్రానికి వెళ్లి రసీదులను పొందాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ బుకింగ్‌తోనే పథకాలు వర్తింపు



దేవరాజుపల్లెలో రైతులకు ఈ-క్రాప్ బుకింగ్ రశీదులు అందిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : రైతులు సాగు చేసిన తమ పంటలకు సంబంధించిన వివరాలను ఈ-క్రాప్ బుకింగ్ ద్వారా నమోదు చేస్తేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని దేవరాజుపల్లె, ఎల్లారెడ్డిపల్లె, గంగవరం, చిన్నచెప్పలి ఆర్‌బీకేలలో రైతులకు వారు ఈ-క్రాప్ బుకింగ్ రశీదులు అందజేశారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా, ఇన్సూరెన్స్, మద్దతు ధర, పంట నష్టం తదితరవి అందాలంటే రైతులు పంటలు సాగు చేసిన తర్వాత ఈ-క్రాప్ బుకింగ్ తప్పని సరిగా చేయించాలన్నారు. 2023 ఖరీఫ్ సీజన్‌లో ఈ-క్రాప్ బుకింగ్ చేసిన రైతులందరికీ రశీదులు ఇస్తున్నామని, ప్రతి రైతు ఆర్‌బీకేలకు వెళ్లి ఈ రశీదులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సరస్వతి, ఏఈఓ దస్తగిరి, వీఏఏలు రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలి



మాట్లాడుతున్న కన్సల్టెంట్ సురేందర్‌రెడ్డి

లింగాల : మండలంలోని అన్ని గ్రామాల రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని స్టేట్ సీనియర్ కన్సల్టెంట్ సురేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం లింగాల వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విస్తరణ విభాగంలో మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ నుంచి ఒక కార్యకర్తను నియమించారన్నారు. వారి ద్వారా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేసేందుకు కృషి చేస్తామన్నారు. విభిన్న పద్ధతుల్లో ఏ గ్రేడ్ మోడల్స్, ఏటీఎం మోడల్స్, డీపీఎం మోడల్స్‌ను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. ఆయా పద్ధతుల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా అడిషనల్ డీపీఎం వసంతకుమారి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లోని మహిళలు ఇంటి వద్దనే కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేసుకుని పురుగు మందులు లేని కూరగాయలు, ఆకుకూరలు పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్ విజయవంతం

వేంపల్లి : విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ సాధనకై విద్యాసంస్థల బంద్ కారణంగా వేంపల్లెలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు బుధవారం మూసివేశారు. కడప ఉక్కు పరిశ్రమ సాధనకై విశాఖ ఉక్కు ఉద్యమానికి వెయ్యి రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో విశాఖ ఉక్కు పరిరక్షణకై తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మం కొత్తకాల్వ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నేడు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రైవేటు వారికి చౌకగా అప్పగించాలని చూస్తుందని, దీన్ని వ్యతిరేకిస్తున్నామని అదేవిధంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ లాభాల్లో నడుస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను మేము నడపలేము అంటూ కేంద్రం ఎందుకు చెప్తుందో అర్థం కావడం లేదన్నారు. కడప ఉక్కు రాయలసీమకు హక్కు అంటూ కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని ఎప్పటినుండో కోరుతున్నామని, అయితే గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామని ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ స్పష్టం చేశారు. బుధవారం విద్యార్థి సంఘాల పిలుపు మేరకు విద్యా సంస్థల రాష్ట్ర వ్యాప్త బంద్‌లో భాగంగా కమలాపురంలో ఆయన పలు పాఠశాలలను మూయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యా సంస్థల బంద్‌కు పిలుపునిచ్చామన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

లింగాల : పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని, అర్హులందరికీ అందేలా చూడాలని ఎంపీపీ రమాదేవి తెలిపారు. బుధవారం లింగాల ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో అంటువ్యాధులు సంభవించకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించి మురికి కుంటల్లో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ నిర్వహించాలని ఆమె అధికారులకు సూచించారు. ప్రస్తుతం తీవ్ర వర్షాభావం వల్ల ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలు సాగుచేయలేదని రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అదేవిధంగా మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతులకు పంటల బీమా అందేవిధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ పాడిపశువుల కొనుగోలుకు వడ్డీలేని రుణాలు అందించాలని, అదే విధంగా సబ్సిడీ ద్వారా పశువుల దాణాను పాడిరైతులకు అందించి ఆదుకోవాలన్నారు. ఇప్పట్ల వైస్ సర్పంచ్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఇప్పట్ల పాఠశాలలో ఉపాధ్యాయులు బాధ్యతారహితంగా పనిచేస్తున్నారని, పాఠశాలలో ఉన్న విద్యార్థులకు న్యాయం చేయలేమంటూ టీసీలు ఇచ్చి పంపుతున్నారని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ గ్రామాల్లో గతంలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు డీకేటీ పట్టాలు అందించారని వాటిని సబ్ డివిజన్ చేయించాలని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు తహసీల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం సమగ్ర భూ సర్వే నిర్వహిస్తున్నామని, ఇందులో డీకేటీ పట్టాలు పొందిన రైతులకు సబ్ డివిజన్ చేయించే అవకాశం ఉందన్నారు. గతంలో డీకేటీ పట్టాలు పొందిన రైతులకు ఆ భూములపై క్రయ విక్రయాలపై పూర్తి హక్కులు కల్పిస్తున్నారన్నారు. అదేవిధంగా వ్యవసాయానికి సంబంధించిన యంత్ర పరికరాలను సబ్సిడీ ద్వారా ప్రభుత్వం రైతులకు అందించాలని పలువురు సభ దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం

వల్లూరు : మండలంలోని లేబాక గ్రామ సచివాలయం ఆవరణలో గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ కేఆర్‌ఎం ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయ పరిధిలోని ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి గ్రామ సచివాలయం వద్ద గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారని మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె : మండలంలోని ఎస్.పాలగిరి సచివాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ఆంధ్రకు జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని సర్పంచులు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.